పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 711 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ మంగళవారం 08.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## పార్టీ ఆఫీస్‌పై చంద్రబాబు ప్రశంసలు..
# వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అభినందన

**విద్యుత్ స్వయం సమృద్ధి దిశగా టీడీపీ కేంద్ర కార్యాలయం**

- సోలార్ ప్యానళ్ల ద్వారా 800 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి
- క్యాంపస్‌లోనే ఒక మెగావాట్ ఉత్పత్తికి అవకాశం ఉందని వెల్లడి
- పర్యావరణ హితమైన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సంతృప్తి
- ఏర్పాట్లకు కృషి చేసిన లోకేశ్ ను అభినందించిన చంద్రబాబు




తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం విద్యుత్ విషయంలో పూర్తి స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యాలయంలో చేపట్టిన పర్యావరణ హితమైన ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం ఆదర్శప్రాయంగా ఉందని, ఇక్కడి వాతావరణం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "టీడీపీ కార్యాలయానికి అవసరమైన కరెంటును మనమే ఉత్పత్తి చేసుకునేందుకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశాం. మనకు 1000 కిలోవాట్ల విద్యుత్ అవసరం ఉండగా, ఇప్పటికే 800 కిలోవాట్లు ఇక్కడే ఉత్పత్తి అవుతోంది. భవిష్యత్తులో ఈ క్యాంపస్‌లోనే ఒక మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం ఉంది" అని వివరించారు. కేవలం విద్యుత్‌కే పరిమితం కాకుండా, భూగర్భ జలాలను సమర్థవంతంగా కూడా వినియోగించుకోవాలని, తరువాయి 2లో



## టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్
# 10 అంశాలపై మేధోమథనం

- హాజరైన సీఎం చంద్రబాబు, లోకేశ్, మంత్రులు, కీలక నేతలు
- పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం, స్థానిక ఎన్నికలపై ప్రధానంగా చర్చ
- మొత్తం 10 అంశాలపై రెండు రోజుల పాటు మేధోమథనం
- ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరణ

టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మంత్రులు తరువాయి 2లో

## నెల్లూరులో యూపీ సీఎం
# యోగి ఆదిత్యనాథ్‌కు ఘనస్వాగతం

- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు తరువాయి 2లో



## వైసీపీది ఉగ్రవాద రాజకీయం
### నిజాలతోనే సమాధానం

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

## తెలంగాణలో..
# డిగ్రీ, పీజీ కళాశాలల బంద్



- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన
- మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం
- వేల కోట్ల బకాయిలతో జీతాలు చెల్లించలేకపోతున్నామని యాజమాన్యాల ఆవేదన
- ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరిక

2లో



## సిలిండర్ బుకింగ్‌పై 2లో
# కేంద్రం ఊరట..

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

## ఢిల్లీలో విషాదం..
# తెరపైకి యూనివర్సిటీ హాస్టళ్ల కొరత



- 7 లక్షల మంది విద్యార్థులు ఉండగా, వేల మందికి మాత్రమే యూనివర్సిటీ హాస్టల్ గదులు
- వారం రోజుల్లో అన్ని పీజీ హాస్టళ్లను తనిఖీ చేయాలని హైకోర్టు ఆదేశం
- భద్రతపై ఆందోళనతో పీజీలు ఖాళీ చేస్తున్న విద్యార్థులు

2లో

## హార్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత..
# భగ్గుమన్న చమురు ధరలు

- యూఎస్-ఇరాన్ నౌకలపై దాడులతో పెరిగిన ఆయిల్ ధరలు
- హార్మూజ్ జలసంధిలో భారీగా తగ్గిన నౌకల రాకపోకలు
- 97 డాలర్లకు చేరువలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర
- ఉత్పత్తి విధానంలో మార్పులు చేయని ఒపెక్ ప్లస్ దేశాలు
- చమురు సరఫరా అంతరాయాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన



పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో తరువాయి 2లో

# నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

(మొదటిపేజీ తరువాయి)
ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

### పార్టీ ఆఫీస్‌పై చంద్రబాబు ప్రశంసలు..
## వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అభినందన

(మొదటిపేజీ తరువాయి)
ఆహార వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి ప్రాంగణంలోని చెట్లకు వినియోగించాలని సూచించారు. పార్టీ కేంద్ర కార్యాలయం, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు, "ఇలాంటి వాతావరణం అంటే అందరికీ ఇష్టమే. ఈ సందర్భంగా మన వర్కింగ్ ప్రెసిడెంట్‌ను (నారా లోకేశ్ ను) అభినందిస్తున్నాను" అని అన్నారు. ప్రస్తుతం పార్టీలో మంచి వాతావరణంలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## వైసీపీది ఉగ్రవాద రాజకీయం.. నిజాలతోనే సమాధానం

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

*** కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం**

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

*** గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి**

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్ రన్‌హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు**

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

### తెలంగాణలో
## డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

## హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత.. భగ్గుమన్న చమురు ధరలు

(మొదటిపేజీ తరువాయి)
పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 810 శాతం వరకు పెరిగాయి. మరోవైపు, సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

### టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్..
## 10 అంశాలపై మేధోమథనం

(మొదటిపేజీ తరువాయి)
పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశం ప్రారంభానికి ముందు వేదికపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, ఇతర నేతలు నివాళులర్పించారు. ఈ కాంక్లేవ్‌లో భాగంగా మొత్తం 10 కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం పార్టీ మధ్య సమన్వయం, అందుబాటులో ఉన్న వనరుల సమర్థ వినియోగం, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావడం, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలపై నేతలు సమాలోచనలు జరుపుతున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలపై ఈ రెండు రోజుల సమావేశంలో విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పార్టీని, ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశం.

## ఢిల్లీలో విషాదం.. తెరపైకి యూనివర్సిటీ హాస్టళ్ల కొరత

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం సంభవించింది. విద్యార్థులు నివసించే ఐదంతస్తుల ప్రైవేట్ పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహం కుప్పకూలిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సత్య నికేతన్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ విషాదం, ఢిల్లీ యూనివర్సిటీలో నెలకొన్న తీవ్రమైన హాస్టళ్ల కొరతను, విద్యార్థుల భద్రత అంశాలను మరోసారి తెరపైకి తెచ్చింది. యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలో ఉన్న ఈ భవనాన్ని "హాస్టల్ డేజ్" పేరుతో బాలుర వసతి గృహంగా నిర్వహిస్తున్నారు. పాత భవనంలో మరమ్మతులు చేపడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బేస్‌మెంట్‌లో నీరు నిలవడం, నిర్మాణ లోపాలు వంటివి ఈ దుర్ఘటనకు ప్రాథమిక కారణాలని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఈ భవన విస్తరణకు ఎటువంటి అనుమతులు లేవని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) స్పష్టం చేసింది. ఈ ఘటనకు సంబంధించి భవన యజమానిని అరెస్ట్ చేయగా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు మున్సిపల్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఢిల్లీ యూనివర్సిటీలో సుమారు 7 లక్షల మందికి పైగా విద్యార్థులు (ఓపెన్ మాధ్యమం విద్యార్థులతో కలిపి) విద్యనభ్యసిస్తున్నారు. 202425 అకడమిక్ సెషన్ కోసం నమోదైన విద్యార్థుల సంఖ్య 2.5 లక్షలు అని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న హాస్టల్ గదుల సంఖ్య కేవలం 7,000 నుండి 8,000 మధ్యనే ఉంది. అంటే గణాంకాల ప్రకారం, రిజిస్టర్డ్ విద్యార్థుల్లో ప్రతి 31 మందిలో ఒకరికి మాత్రమే హాస్టల్ వసతి లభిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు అనివార్యంగా ప్రమాదకరమైన, ఎటువంటి నియంత్రణ లేని ప్రైవేట్ పీజీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ ఘటనపై సోమవారం స్పందించిన ఢిల్లీ హైకోర్టు, వారం రోజుల్లోగా నగరంలోని అన్ని పీజీలు, హాస్టళ్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, భవన నిర్మాణ నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎంసీడీని ఆదేశించింది. మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా నగరంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అన్ని ఐదంతస్తుల భవనాలను సీల్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంతో భయాందోళనలకు గురైన విద్యార్థులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళుతుండగా, ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు రప్పించుకుంటున్నారు.

### తెలంగాణలో మళ్లీ వర్షాలు..
## 20 జిల్లాలకు అలర్ట్ జారీ



తెలంగాణలో వర్షాలు మళ్లీ పుంజుకున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేస్తూ.. రాజధాని సహా ఆరు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', మరో 14 జిల్లాలకు 'యెల్లో అలర్ట్' జారీ చేసింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది.

## సిలిండర్ బుకింగ్‌పై కేంద్రం ఊరట..



వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## సంపాదకీయం

### రాజ్యాధికారమా? ఆత్మగౌరవమా?

# వెనుకబాటుతనం వెనుక అసలు నిజాలు!

కులవివక్ష అనేది భారతదేశంలో రూపుమాసిపోవడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఎన్ని రిజర్వేషన్లు కల్పించినా సమాజంలో మార్పు రానంత కాలం అది సాధ్యం కాదు, ముఖ్యంగా దళితుల విషయంలో. గతంలో ఉన్నంత కులం పట్టింపు ఇప్పుడు లేదు కానీ, అన్ని కులాల మధ్య మానవ సంబంధాలు వెల్లివిరియటం లేదు అనేది వాస్తవం. కులం పట్టింపు లేదు అని అందరం అనుకుంటాం. కానీ మనకు తెలియకుండా మన దగ్గర కూడా వివక్ష ఉంటుంది. అది కులవివక్షా లేక వర్గ వివక్షా అనేది నిర్ణయించటం కష్టం. స్వాతంత్ర్యం వచ్చి ఎనభై సంవత్సరాలు గడచినా, రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు పూర్తి అయినా వెనుకబడిన వర్గాలు అనే పదం లేని సమాజాన్ని చూడలేకపోతున్నాము. రాజ్యాంగ ముసాయిదా చైర్మన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వెనుకబడిన వర్గాల వెనుకబాటుతనం పోవాలంటే పది సంవత్సరాలు రిజర్వేషన్లు ఉండాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. అప్పటినుండి ఇప్పటికీ వెనుకబాటుతనం పోలేదు; రిజర్వేషన్లు అమలు అవుతూనే ఉన్నాయి. అవి అమలయ్యే తీరు ఇలాగే కొనసాగితే మరో ఎనభై సంవత్సరాలు గడచినా వెనుకబాటుతనం పోదు. స్వాతంత్ర్యం వచ్చిన రోజు జనాభాలో ఎంత శాతం ఎస్సీ, బీసీలు ఉన్నారో ఇప్పటికీ అదే శాతం కొనసాగుతుంది . అంతమంది ఉండటం ఆశ్చర్యం కాదు, అదే నిష్పత్తిలో వెనుకబడి ఉండటమే ఆశ్చర్యం. ఇప్పటికీ వెనుకబడిన వర్గాలకు ఇచ్చే రాజకీయ పదవులు ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని ఇచ్చినట్లుగానే భావించవలసి వస్తుంది. ఎస్సీ ఓటు బ్యాంకుకు ఒక తరహా రాజకీయం, బీసీ ఓటు బ్యాంకు కోసం మరో రకం రాజకీయం. ఇక ఒక మహిళను రాష్ట్రపతిని చేస్తే ఈ విశ్వంలో ఉన్న మహిళా లోకాన్ని మొత్తాన్ని ఉద్ధరించినట్లు ఒక పార్టీ ప్రచారం చేసుకుంటుంది. ఒక ఎస్సీని రాష్ట్రపతిని చేస్తే మొత్తం ఎస్సీలను అందలాలు ఎక్కించినంత అట్టహాసంగా చెప్పకుంటుంది మరో పార్టీ. ఎస్టీని రాష్ట్రపతిని చేస్తే ప్రపంచంలో విస్తుపోయే అంశాలలో అదొకటి. ఇటువంటి పదవులు ఆయా వర్గాలకు వస్తే, అవి వారికిచ్చిన బహుమతిగా ఎందుకు ప్రచార పటాటోపానికి వినియోగించుకుంటున్నాయి రాజకీయ పార్టీలు? రాజ్యాంగ ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా, స్వాతంత్ర్యానికి ముందే వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖా మంత్రిగా, స్వాతంత్ర్యానంతరం తొలి కేబినెట్‌లో న్యాయశాఖ మంత్రిగా చేసిన బి.ఆర్. అంబేద్కర్ ఒక వర్గానికే నాయకుడిగా చెలామణి అయ్యే పరిస్థితి ఎందుకు వచ్చిందో తెలుసుకోకపోతే, రాబోయే తరాలకు ఆయన ఈ దేశానికి చేసిన సేవలు మరుగున పడే ప్రమాదం ఉన్నది. రిజర్వేషన్లు ఎంతకాలం అమలు చేస్తే వెనుకబడిన వర్గం అనే పదం మన రాజ్యాంగం నుండి తీసివేయబడుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితిలో ఉన్నాము. వెనుకబాటుతనాన్ని కుల ప్రాతిపదికన కాక మత ప్రాతిపదికగా చేయటం పైన ఆక్రోశంతో ఉన్నాయి కొన్ని వర్గాలు. వెనుకబడిన వర్గాల చేతికి రాజ్యాధికారం వస్తేనే వెనుకబాటుతనం పోతుంది అని కొందరంటారు. అందులో వాస్తవం ఎంత ఉన్నదో అర్థం కాదు. కారణం, ఇప్పటివరకు భారత ప్రధాన మంత్రులుగా సుదీర్ఘకాలం పరిపాలించిన బ్రాహ్మణుల వలన ఆ వర్గానికి ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదు. గతంలో మంత్రాంగం అంటే వారే చేయగలరు అని అనేవారు. ఇప్పడు అనేక రాష్ట్రాల మంత్రివర్గంలో వారికి ప్రాతినిధ్యం కూడా లేదు. దేవేగౌడను పక్కన పెడితే ప్రస్తుత ప్రధాని బీసీ వర్గానికి చెందినవారు. ఎన్నికల ద్వారా ప్రధాని అయి సుదీర్ఘకాలం పరిపాలించి రికార్డు కూడా సృష్టించారు. ప్రస్తుతం దేశంలో తిరుగులేని నాయకుడు అనేది ఒప్పకుని తీరాలి. అంటే బీసీ సామాజికవర్గం చేతికి తిరుగులేని అధికారం వచ్చింది అనేది వాస్తవం. విచిత్రంగా బీసీ వర్గాలు తమ వర్గానికి రాజ్యాధికారం వచ్చిందని సంబరాలు కూడా చేసుకోవడం లేదు; ఇంకా పాత నినాదంతోనే ముందుకు వెళ్తున్నారు. అంటే రాజ్యాధికారం అంటే ప్రధానమంత్రి లాంటి పదవులు కాదని అనుకోక తప్పదు. ఇంకా ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీల నుండి ప్రధానమంత్రిగా ఎవరూ రాలేదు కానీ, రాష్ట్రపతి పదవిని మాత్రం అధిరోహించారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి పదవి అత్యున్నతమైనది. కేంద్రం అడుగు ముందుకు వేయాలంటే రాష్ట్రపతి ఆమోదముద్ర పడాలి. అంతటి శక్తివంతమైన పదవిని ఎస్సీ, ఎస్టీ వర్గం వారు పొందినందువలన వారికి ఒరిగినదీ ఏమీ లేదు. మన భారతీయ సమాజంలో వర్ణపోరు పోయి కులపోరులోకి వచ్చాము. కమ్యూనిస్టులు చెప్పే వర్గపోరును ఒప్పకోరు కానీ, సమాజంలో వర్గపోరు బలంగా నాటుకుపోయింది. కమ్యూనిస్టులు చెప్పే ధనవంతులు-బీదవారు, పెట్టుబడిదారులు-శ్రామికవర్గం, పాలకులు-పీడితులు లాంటి వర్గాల కంటే బలమైన వర్గ విభజన జరిగిపోయింది: రాజకీయంగా పలుకుబడి కలిగినవారు, అటువంటి పలుకుబడి లేనివారు. ఇక్కడ పీడన ఉండదు; కనిపించని దోపిడీ ఉంటుంది. కులాలను అడ్డుపెట్టుకుని ఎదుగుతారు; ఎదిగిన తరువాత మరొకరు ఎదగకుండా చూసుకుంటారు. వారి మనుగడకు కష్టం రాకుండా చూసుకోవాలని ఎవరికైనా ఉంటుంది. రిజర్వేషన్లు ఉపయోగించుకుని ఒక తరం చదువుకుని ఉద్యోగం చేసుకునేవారు వెనుకబడిన వర్గం కాదు అంటే—ఆర్థికంగా వెనుకబాటుతనం పోయినా, సాంస్కృతిక పరంగా వెనుకబడి ఉండటం వలన వెనుకబడిన తరగతి క్రింద ఉన్నట్లుగానే పరిగణించాలి. ఇక రాజకీయంగా వెనుకబడిన తరగతి నుండి ఎన్నిసార్లు ఎన్నికల్లో గెలిచినా, ఎంత పెద్ద పదవులు చేపట్టినా కుల ఆధారిత రిజర్వేషన్ అలాగే ఉంటుంది. వేరే వారికి అవకాశం రావడానికి ఎంత కాలం పడుతుంది అనేది ఊహించటం కూడా కష్టం. విద్యా, ఉపాధి రంగాలలో రిజర్వేషన్ అందరికీ ఒకే రకంగా వర్తించినా, ముందే వాటిని సాధించిన వారితో అప్పటివరకు పూర్తిగా వెనుకబడి ఉన్నవారు పోటీ పడటం కష్టం. మరో బాధాకరమైన అంశం ఏమిటంటే, ఆయా వర్గాల నుండి పైకి వచ్చిన వారిలో చాలామంది పూర్తిగా వెనుకబడిన వారితో నెరిపే సంబంధాలలో కూడా అంతరం కనిపిస్తున్నది. అంతర్గత వ్యవహారాలు ఇలా ఉంటే సమాజ దృక్పథం వేరే విధంగా ఉంటున్నది. వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా ఎస్సీలకు వేరే వర్గాలకు మధ్య అంతరాలు పెరిగిపోయాయి. వారి ఆత్మగౌరవం కోసం చేసిన చట్టాలు దుర్వినియోగం అవటం వలన కూడా వివిధ వర్గాలతో వారి సంబంధాలు దెబ్బతిన్నాయి. రిజర్వేషన్లతో చదువుకున్నా ఉద్యోగం దగ్గరకు వచ్చేటప్పటికి ఎస్సీ, ఎస్టీలు వివక్షను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు సక్రమంగానే అమలు అవుతున్నాయి కానీ, ప్రైవేట్ సంస్థలు రిజర్వేషన్లను అనుసరించడానికి ఆమోదించడం లేదు. వారిని ప్రభుత్వాలు ఒత్తిడి చేయటం కష్టం; ఒత్తిడి చేస్తే అసలు పెట్టుబడి కూడా పెట్టరు అని ప్రభుత్వాల భయం. అందుకని చదువుకుని కూడా కాయకష్టం చేయవలసిన పరిస్థితిలో ఉంటున్నారు దళిత వర్గాలు. రోజురోజుకూ ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోవటం కూడా వారి అభివృద్ధికి అవరోధంగా మారుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో అణగారిన వర్గాలు అనే పదం తొలగించే అవకాశం ఎప్పడు వస్తుందో మరి! ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రకటించినా, ఎన్ని ఉచితాలు ఇచ్చినా అవి తాత్కాలిక ఉపశమనం అవుతాయి కానీ, ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించినట్లు కాదు. రిజర్వేషన్లు ఇచ్చినా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడితేనే వెనుకబడిన వర్గాల వారి పిల్లలు కూడా అందరితోనూ పోటీ పడే అవకాశం ఉంటుంది. అయితే పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం ఒక్కటే సరిపోదు; మెరుగుపడిన ప్రమాణాల స్థాయిని అందుకునే పరిస్థితులను వారికి కల్పించాలి. అంటే ఇంటి వాతావరణం కూడా వారు చదువుకోవడానికి అనువుగా ఉండాలి. గతంలో ఉన్నంత పేదరికం ఇప్పడు వెనుకబడిన వర్గాల వారికి కూడా లేదు. ఇక్కడే సాంస్కృతిక పరమైన వెనుకబాటుతనం తన ప్రభావాన్ని చూపిస్తుంది. అటువంటి పరిస్థితులు వారి పిల్లల చదువును ప్రభావితం చేయకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే తప్ప, ఒక్క రిజర్వేషన్లతోనే వెనుకబాటుతనాన్ని జయించలేరు. సమాజంలో సగభాగం కంటే ఎక్కువ ఉన్న ఎస్సీ, బీసీల వెనుకబాటుతనాన్ని పారద్రోలి, దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయనంత కాలం సమాజంలో ఉన్న అంతరాలు సమసిపోవు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

### సెప్టెంబర్ 8

SEP 8

- 1966: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం
- 1951: ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం (ఫిజియోథెరపీ డే)
- 1879: పరిపాలనాదక్షుడు, పండితుడు మొక్కపాటి సుబ్బారాయుడు జననం (మ.1918).
- 1910: తెలుగు రచయిత, సినిమా దర్శకుడు త్రిపురనేని గోపీచంద్ జననం (మ.1962).
- 1926: అస్సాంకు చెందిన నేపథ్య గాయకుడు, గీత రచయిత, నటుడు, చిత్రనిర్మాత భూపేన్ హజారికా జననం (మ.2011).
- 1931: ఆంధ్రప్రదేశ్ స్పీకరుగా పనిచేసిన తంగి సత్యనారాయణ జననం (మ.1984).
- 1933: హిందీ సినిమా గాయని ఆశా భోస్లే జననం. (చిత్రంలో)
- 1933: పారిశ్రామిక వేత్త కరుటూరి సూర్యారావు జననం



ఆశా భోస్లే

(మ.2011).

- 1936: సంగీత దర్శకుడు చక్రవర్తి జననం (మ.2002).
- 1963: తెలుగు సినిమా దర్శకుడు గరికపాటి రాజారావు మరణం (జ.1915).
- 2012: శాస్త్రవేత్త, రచయిత కొడవటిగంటి రోహిణీప్రసాద్ మరణం (జ.1949).
- 1960: భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు ఫిరోజ్ గాంధీ మరణం (జ.1912).

### టీడీపీ సదస్సులో 'P4విజన్ 2047'పై వేమిరెడ్డి

# ప్రశాంతిరెడ్డి ప్రజెంటేషన్

- **ప్రజల భాగస్వామ్యంతోనే విజన్ లక్ష్యాలు సాధ్యమని స్పష్టీకరణ**
- **ప్రతి శాఖ పనితీరుకు కేపీఐలు ఉండాలని, పనితీరును కొలవాలని సూచన**
- **'నా నియోజకవర్గం–నా విజన్, నా యాక్షన్ ప్లాన్–నా బాధ్యత' లక్ష్యంతో ఎమ్మెల్యేలు పనిచేయాలి**
- **యువతకు కంపెనీల భాగస్వామ్యంతో శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు అందించాలని పిలుపు**




సమావేశాల సంఖ్య కాదు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం అని టీడీపీ మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 'P4-స్వర్ణాంధ్ర విజన్ 2047'పై ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. కేవలం ప్రభుత్వాలు, అధికారులు మాత్రమే కాకుండా ప్రజలు, యువత భాగస్వాములైతేనే 'విజన్ 2047' లక్ష్యాలు సాధ్యమవుతాయని ఆమె పిలుపునిచ్చారు. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు 'P4' (ప్రజలు, ప్రైవేటు, ప్రభుత్వం, భాగస్వామ్యం) విధానాన్ని తీసుకొచ్చారని వివరించారు. ప్రతి ఎమ్మెల్యే 'నా నియోజకవర్గం-నా విజన్, నా యాక్షన్ ప్లాన్-నా బాధ్యత' అనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. తమ నియోజకవర్గంలోని ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా, మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడమే కాకుండా, వివిధ శాఖలను సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలే చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి నెలా నియోజకవర్గ అభివృద్ధి ప్రగతిని ప్రజల ముందుంచి జవాబుదారీతనంతో పనిచేయాలని కోరారు. ప్రతి శాఖకు, ప్రతి కార్యక్రమానికి కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (KPIలు) తప్పనిసరిగా ఉండాలని ప్రశాంతిరెడ్డి నొక్కిచెప్పారు. కేపీఐల ద్వారా పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, లోపాలున్న చోట వేగంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. 2029 నాటికి రాష్ట్ర జీడీపీని రూ.66 లక్షల కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో పనిచేయాలని, రైతుల ఆదాయం పెంచేందుకు పంటలకు విలువ జోడింపు (ప్రాసెసింగ్, ప్యాకేజింగ్) చేయాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కంపెనీల భాగస్వామ్యంతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు అందించాలని ప్రతిపాదించారు. సంజీవని ఆరోగ్య ప్రాజెక్ట్ ద్వారా సుమారు 85 లక్షల మంది ఆరోగ్యంపై డిజిటల్ పర్యవేక్షణ ఉంటుందని ఆమె వెల్లడించారు.

### చంద్రబాబు కేవలం తెలుగుదేశం ఆస్తి కాదు..

# యావత్ తెలుగుజాతి ఆస్తి: పయ్యావుల

- **టీడీపీ నేతల సమావేశంలో స్వర్ణాంధ్ర విజన్ 2047పై మంత్రి పయ్యావుల ప్రజెంటేషన్**
- **చంద్రబాబు ముందు, తర్వాత అని ఏపీ అభివృద్ధిని చూడాలన్న ఆర్థిక మంత్రి**
- **పట్టిసీమతో 200 సార్లు ప్రకాశం బ్యారేజీ నింపిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంస**



ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం తెలుగుదేశం పార్టీ ఆస్తి కాదని, యావత్ తెలుగు జాతి ఆస్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభివర్ణించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్‌పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకత్వ దార్శనికతను, ఆయన రూపొందించిన విధానాల వల్ల కలిగిన ప్రయోజనాలను ఉదాహరణలతో వివరించారు. ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "వాట్ చంద్రబాబు థింక్స్ టుడే, నేషన్ థింక్స్ టుమారో (చంద్రబాబు ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది)" అనేది అక్షర సత్యమని పయ్యావుల అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రూపొందించిన 'విజన్ 2020' దేశంలోనే తొలి విజన్ డాక్యుమెంట్ అని, దానిని చూశాకే అనేక రాష్ట్రాలు తమ విజన్ పత్రాలను తయారు చేసుకున్నాయని గుర్తుచేశారు. నాడు విజన్ 2020ని కొందరు అవహేళన చేసినా, అదే రాష్ట్రానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టికి ఐటీ రంగం అభివృద్ధి ఒక నిదర్శనమని పయ్యావుల పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందే వందల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి మానవ వనరులను సిద్ధం చేశారని, అందుకే ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతకు ఐటీ ఉద్యోగాలు వెంటనే లభించాయని వివరించారు. ఆయన ప్రణాళిక వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఐటీ నిపుణులుగా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్నారని అన్నారు.

# కోటి ఇళ్లను దాటి మరింత ముందుకు... 43వ రోజు విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం–2026'

- **43వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం**
- **ఇప్పటివరకు 1.06 కోట్ల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు**
- **సోమవారం ఒక్కరోజే 1.30 లక్షల కుటుంబాలతో నేతల భేటీ**
- **కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ**
- **కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్న టీడీపీ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. సోమవారంతో ఈ కార్యక్రమం 43వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.06 కోట్ల




ఇళ్లను సందర్శించి ఈ కార్యక్రమం ఒక కీలక మైలురాయిని దాటింది. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఒక్కరోజే టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి 1,30,402 ఇళ్లను సందర్శించారు. ప్రతి గడపకూ వెళ్లి కుటుంబ సభ్యులతో ముఖాముఖిగా సంభాషిస్తూ ప్రభుత్వ పనితీరును వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులు.. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న పథకాల ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసేలా వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, పార్టీ శ్రేణులతో పాటు సాధారణ ప్రజలు కూడా ఉత్సాహంగా ఇందులో భాగస్వాములవుతున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతోంది.

## బాపట్ల జిల్లాలో భారీ వర్షం..
# చినగంజాం జలమయం

- **చినగంజాంలో మోకాళ్ల లోతు నీటితో స్తంభించిన రాకపోకలు**
- **ఉప్పు మడుల్లో నీరు చేరడంతో నష్టపోయిన రైతులు**
- **గుంటూరు, బాపట్ల సహా నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ**
- **గంటకు 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని విపత్తుల సంస్థ హెచ్చరిక**



బాపట్ల జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా చినగంజాం మండలంలో కురిసిన కుండపోత వానకు జనజీవనం స్తంభించింది. పలు రహదారులు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం కారణంగా ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోయారు. తీయడానికి సిద్ధంగా ఉన్న ఉప్పు మడుల్లోకి వర్షపు నీరు చేరడంతో ఉప్పంతా కరిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) హెచ్చరిక జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు, వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని, చెట్లు, కరెంట్ స్తంభాల కింద నిలబడకూడదని స్పష్టం చేసింది. గాలుల తీవ్రతకు బాపట్ల జిల్లాలోని జాతీయ రహదారిపై ఓ సూచిక బోర్డు కూలిపోయిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో, ముఖ్యంగా బాపట్ల జిల్లాలో వర్షపాతం లోటు గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో తాజా వర్షాలు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, స్థానికంగా నీరు నిలిచిపోవడం, ఉప్పు రైతులు నష్టపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. విపత్తుల సంస్థ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# డీఎస్సీపై వైసీపీ విష ప్రచారం.. మాజీ సైనికుడిపై దాడి హేయం: కోటంరెడ్డి

- **మెగా డీఎస్సీపై వైసీపీ, సాక్షి మీడియా విషం చిమ్ముతున్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి ఫైర్**
- **కుప్పంలో మాజీ సైనికుడిపై వైసీపీ శ్రేణులు, సాక్షి ప్రతినిధులు దౌర్జన్యం చేశారని ఆరోపణ**
- **జగన్ ప్రెస్‌మీట్ పెడితే పార్టీకి లక్ష ఓట్లు నష్టమని వైసీపీ నేతలే వాపోతున్నారన్న కోటంరెడ్డి**
- **గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ ఇవ్వని జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియదని ఎద్దేవా**

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ, సాక్షి మీడియా ఉద్దేశపూర్వకంగా విష ప్రచారం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశ సరిహద్దుల్లో సేవలు అందించిన ఒక మాజీ సైనికుడిపై దాడికి దిగడం వైసీపీ గూండాయిజానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా భర్తీ చేసిన 16,347 ఉపాధ్యాయ పోస్టులను చూసి ఓర్వలేకే వైసీపీ దగాకోరు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.

*** మాజీ సైనికుడిపై దాడి దుర్మార్గం**

కుప్పంలో మాజీ సైనికుడు చక్రపాణి రెడ్డిపై వైసీపీ శ్రేణులు, సాక్షి ప్రతినిధులు సాగించిన దౌర్జన్యం అత్యంత హేయమైన చర్య అని కోటంరెడ్డి అన్నారు. "దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికుడిపై దాడి చేస్తారా? నీ సర్టిఫికెట్లు దొంగవి అంటూ బెదిరించడానికి సాక్షి మీడియా, వైసీపీ నేతలు సీబీఐ అధికారులా?



అధికారం పోయినా గూండాయిజం చేస్తామంటే కుదరదు. ఈ ఘటనపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి, నిందితులపై రౌడీషీట్లు తెరిచి పీడీ యాక్ట్ కింద జైలుకు పంపాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేముల రామకృష్ణ అనే అభ్యర్థికి డీఎస్సీలో ఉద్యోగం రాలేదని స్వయంగా ఆయనే వెల్లడించినా, వైసీపీ తప్పుడు ప్రచారం చేసిందని కోటంరెడ్డి విమర్శించారు. "రామకృష్ణ మీడియా ముందుకు వచ్చి, తనకు ఉద్యోగమే రాలేదని, ప్రస్తుతం ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. దీంతో వైసీపీ అబద్ధాల బండారం బట్టబయలైంది. డీఎస్సీని అడ్డుకునేందుకు హైకోర్టులో 335 కేసులు వేయించి భంగపడ్డారు. ఇప్పుడు ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారు" అని అన్నారు.

**జగన్‌పై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన జగన్‌కు, డీఎస్సీకి ఏపీపీఎస్సీకి తేడా కూడా తెలియదని కోటంరెడ్డి ఎద్దేవా చేశారు. "15 రోజులకోసారి బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్ మీట్ పెట్టడం, అబద్ధాలు మాట్లాడటం జగన్‌కు అలవాటైంది. ఆయన ప్రెస్ మీట్ పెడితే పార్టీకి లక్ష ఓట్లు గల్లంతవుతున్నాయని సొంత పార్టీ నేతలే వాపోతున్నారు. ఇప్పటికైనా ఆయన పద్ధతి మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో మిగిలిన 11 సీట్లు కూడా దక్కవు" అని కోటంరెడ్డి హెచ్చరించారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకోవాలనే దురుద్దేశంతోనే వైసీపీ అలజడులు సృష్టిస్తోందని, ప్రజలు ఈ కుట్రలను నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు.



# ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- **ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం**
- **ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి**
- **అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

# నెల్లూరు నుంచి నేరుగా తిరుమల వెళ్లిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

- **నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూపీ సీఎం యోగి**
- **వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస**
- **స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్**
- **గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**
- **తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య**



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

*** స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం: యోగి**

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్ సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

*** గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.









## అమరావతిలో సీసీరోడ్ల స్థానంలో తారు రోడ్లు..
# ప్రభుత్వం ఉత్తర్వులు



అమరావతి: రాజధాని అమరావతి రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. సీసీ రోడ్ల స్థానంలో తారు రోడ్లు నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. టైప్ బీ, సీ, డీ, ఈ, ఎల్‌పీఎస్ రోడ్లలో తారు రోడ్ల విధానం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీవో 1114 ద్వారా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అనుమతి ఇచ్చింది. సీఆర్ఆర్ఐ, బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్స్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఐఆర్‌సీ 37 నిబంధనల ప్రకారం 5 ఎంఎస్‌ఏ ట్రాఫిక్ సామర్థ్యంతో రోడ్లను డిజైన్ చేయనున్నారు. ఈ మేరకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం రేవంత్ రెడ్డి

- **బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ**
- **కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి**
- **2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం**
- **పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ**
- **లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.



**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## కష్టపడి మెగా డీఎస్సీ సాధించిన నిరుద్యోగులపై బురదజల్లుతారా? : రాంప్రసాద్ రెడ్డి

- **డీఎస్సీ విజేతలపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు మానుకోవాలన్న రాంప్రసాద్ రెడ్డి**
- **స్వార్థ రాజకీయాల కోసం వారిని అవమానించవద్దని హితవు**

మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన



అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

## నాయకులు అహంకారానికి దూరంగా ఉండాలి

**: ఎంపీ రామ్మోహన్ నాయుడు**

టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగం చేశారు. నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని, ప్రజా జీవితంలో ఉన్నవారు తమ ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అభ్యర్థి ప్రవర్తన 68.9 శాతం వరకు గెలుపోటములను ప్రభావితం చేస్తుందని పలు సర్వేలు చెబుతున్నాయని రామ్మోహన్ నాయుడు గుర్తుచేశారు. ఉత్తమ పనితీరుతో నాయకత్వాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చూసి నేర్చుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ఓటర్లు, పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా జెన్ జీ యువత



ఆలోచనలకు అనుగుణంగా మన కార్యాచరణ ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటిని వేగంగా పరిష్కరించే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యలను ఓపికగా వినే సహనం నాయకులకు చాలా అవసరమని అన్నారు. నాయకుడిగా ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా అహంకారాన్ని దరిచేరనీయవద్దని రామ్మోహన్ నాయుడు హితవు పలికారు. ప్రవర్తనే నాయకుడికి అసలైన కొలమానమని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు

*** ఛైర్మన్ వి.నారాయణన్**

ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలకు ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెరదించారు. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరిగినా.. ఇస్రోకు ముప్పు లేదని తెలిపారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పరిశ్రమల పాత్ర కొత్తదేమీ కాదని నారాయణన్ పేర్కొన్నారు. విస్తృత బాధ్యతలు చేపట్టేలా ఇస్రో మరింత శక్తిమంతంగా



మారుతుందన్నారు. ప్రస్తుతం సుమారు 450 పరిశ్రమలు ఇస్రోతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దేశ అవసరాలకు ఏటా దాదాపు 50 లాంచ్ వెహికిల్స్ అవసరమని.. ఆ స్థాయిలో ప్రయోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఇస్రోతో పాటు మరింత విస్తృత వ్యవస్థ కీలకమన్నారు.

## ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్లు' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది.

## తెలంగాణలో మళ్లీ వర్షా లు..20 జిల్లాలకు అలర్ట్ జారీ

- **తెలంగాణలో మళ్లీ ప్రారంభమైన వర్షా లు**
- **రాష్ట్రంలోని 20 జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక**
- **హైదరాబాద్ సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
- **గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం**

తెలంగాణలో వర్షాలు మళ్లీ పుంజుకున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్



వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేస్తూ.. రాజధాని సహా ఆరు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', మరో 14 జిల్లాలకు 'యెల్లో అలర్ట్' జారీ చేసింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది.

## మెగా డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం.. వేధిస్తే కఠిన చర్యలు: ఏపీ ప్రభుత్వం

- **మెగా డీఎస్సీ 2025 నియామకాలపై ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం**
- **స్పోర్ట్స్ కోటా ఎంపికలు పారదర్శకంగా జరిగాయన్న క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)**
- **ఉపాధ్యాయులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
- **టెట్ అర్హతలపై పలువురు అభ్యర్థుల విషయంలో స్పష్టత ఇచ్చిన అధికారులు**

ఏపీ మెగా డీఎస్సీ 2025 నియామకాలపై గత పది రోజులుగా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ భరణి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

*** స్పోర్ట్స్ కోటా నియామకాలు**



**పారదర్శకం: శాప్**

స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండీ భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామని, ఆ సమయంలో జూడో సర్టిఫికెట్లపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు. ప్రస్తుతం హైకోర్టులో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం (PIL No. 170) కూడా డీఎస్సీ నియామకాలు పూర్తయిన ఏడాది తర్వాత దాఖలైందని, దాని పరిధి 2018 నుంచి జరిగిన అన్ని క్రీడా కోటా నియామకాలపై ఉందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో రాత పరీక్ష మార్కులతో సంబంధం లేకుండా క్రీడాకారుల ప్రతిభకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, ఇది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధారణ ప్రక్రియ అని స్పష్టం చేశారు. కొందరు క్రీడాకారులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు ఖండించారు. జాతీయ స్థాయి బాక్సర్ పెద్ద అప్పల రాజు విషయంలో ఆన్‌లైన్‌లో పొరపాటున సోదరుడి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా, తర్వాత సరిదిద్దుకున్నారని.. ఆయన పత్రాలన్నీ నిజమైనవేనని వీడియో ఫుటేజ్‌తో సహా నిర్ధారించుకున్నామని తెలిపారు. అలాగే, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీడీపీ ఎమ్మెల్యే కోన రవికుమార్ సంతకం చేయడంపై మాట్లాడుతూ.. జాతీయ సమాఖ్య అధికారికంగా అనుమతి ఇచ్చినందునే ఆయన సంతకం చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేశారు.

**టెట్ అర్హతలపై పూర్తి స్పష్టత**

టెట్ అర్హత మార్కుల విషయంలో వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా వివరణ ఇచ్చారు. కర్నూలుకు చెందిన అభ్యర్థి ప్రభాకర్ (బీసీ) టెట్‌లో 77 మార్కులు సాధించి అర్హత పొందారని, దీనిపై మరింత స్పష్టత కోసం సెప్టెంబర్ 5న త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా, జంపాల ఉష (బీసీ) 2012లోనే టెట్‌లో 80 మార్కులతో అర్హత సాధించారని, అప్పట్లో లాంగ్వేజ్ పండిట్లకు ప్రత్యేక టెట్ లేదని, ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. మిగిలిన అభ్యర్థుల అర్హతలు కూడా నిబంధనల ప్రకారమే ఉన్నాయని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ రెవెన్యూ శాఖ పరిధిలోని అంశమని, అనుమానం ఉన్న సర్టిఫికెట్లను పునఃపరిశీలన కోసం జిల్లా కలెక్టర్లకు పంపామని తెలిపారు.

## గాల్లో ఉండగా.. విమానం ఇంజిన్‌లో తగ్గిపోయిన ఆయిల్

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఈ విమానం సోమవారం ఉదయం కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అబుధాబికి బయల్దేరింది. టేకాఫ్ అయిన సుమారు 50 నిమిషాల తర్వాత.. మొదటి ఇంజిన్‌లో ఆయిల్ తగ్గడాన్ని పైలట్లు గుర్తించారు. ఆయిల్ ప్రెజర్ ప్రమాదకర స్థాయికి చేరడంతో వెంటనే ఆ ఇంజిన్‌ను ఆపివేశారు. మిగిలిన ఒకే ఇంజిన్‌తో ప్రయాణం కొనసాగించడం కష్టం కావడంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఒకే ఇంజిన్‌తో 45నిమిషాల పాటు ప్రయాణించిన ఆ విమానం పైలట్ల అప్రమత్తతో సురక్షితంగా కొచ్చి విమానాశ్రయంలో దిగింది. దీనిపై విమానయాన సంస్థ స్పందించింది. ఘటనకు దారి తీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు చేపట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సంబంధిత అధికారులను ఆదేశించింది.

*** అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద డ్రోన్‌ల కలకలం..**

అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద అనుమానాస్పద డ్రోన్‌లు కలకలం సృష్టించాయి. ఈ విమానాశ్రయం భారత్ పాక్ సరిహద్దులకు సమీపంలో ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఏడు విమానాలను దారి




మళ్లించామని.. కొన్ని గంటలపాటు ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేశామని వెల్లడించారు. విమానాశ్రయ ప్రహరీ గోడ వెలుపల పలు డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వెల్లడించింది.

## రక్షణ రంగానికి ఊతం.. రూ.1.10 లక్షల కోట్లతో సైనిక కొనుగోళ్లకు ఆమోదం

భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.10 లక్షల కోట్ల వ్యయంతో సైనిక సామగ్రి కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ).. సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రాడార్లు, అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు, మెకానికల్ మైన్ లేయర్ (మందుపాతరలు అమర్చే వాహనాలు)లు వంటివి



ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోళ్లలో 98 శాతం దేశీయంగానే చేయనున్నారు. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యం కోసం సీబీఆర్ఎన్ నిఘా వాహనాలు, మెకానికల్ మైన్ లేయర్లు, తేలికపాటి హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, 'సర్వత్ర' వంతెన వ్యవస్థ వంటివి ఉన్నాయి. నౌకాదళం కోసం ఆరుద్ర రాడార్లు, మెరైన్ గ్యాస్ టర్బైన్‌లు కొనుగోలు చేయనున్నారు. వైమానిక దళానికి సంబంధించి యుద్ధ, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంపొందించే వివిధ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అదేవిధంగా గ్రౌండ్ బేస్డ్ మల్టీపర్పస్ జామర్ కొనుగోలుకు, డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్ వ్యవస్థ ఏర్పాటుకు రక్షణశాఖ అనుమతి మంజూరు చేసింది.

# ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్

- **శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్**
- **తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి**
- **ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ**

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన



తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## జోగు రామన్న అరెస్ట్..
# ఆదిలాబాద్‌లో ఉద్రిక్తత

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్ కు నిరసనగా ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన**
- **జోగు రామన్న నేతృత్వంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా**
- **అరెస్టులకు భయపడేదే లేదన్న జోగు రామన్న**



అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ... మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ రాస్తారోకో చేపట్టాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాయి. సమాచారం అందుకున్న పోలీసులు జోగు రామన్నతో పాటు ఇతర నేతలను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా... బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది.
జోగు రామన్నను అరెస్టు చేసి వాహనంలోకి తరలిస్తుండగా, బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనానికి అడ్డంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు. పోలీసులు శ్రేణులను పక్కకు నెట్టి వాహనాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు యత్నించినా పలుమార్లు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడం, దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. అరెస్టులకు భయపడేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు.. జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష

- **టోక్యో నిర్మలమైన ఆకాశాన్ని చూపిస్తూ ఓ భారతీయుడి వీడియో**
- **ఢిల్లీ ఆకాశం అలా ఎందుకు ఉండదని సూటి ప్రశ్న**
- **ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువే అయినా కాలుష్యం తక్కువ**
- **ప్రయత్నిస్తే ఢిల్లీని కూడా పరిశుభ్రంగా మార్చవచ్చని ఆశాభావం**

జపాన్ రాజధాని టోక్యోలో నివసిస్తున్న ఓమ్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రస్తుతం



చర్చనీయాంశంగా మారింది. టోక్యోలోని స్వచ్ఛమైన నీలాకాశాన్ని చూపిస్తూ, మన దేశ రాజధాని ఢిల్లీలో ఆకాశం ఎందుకు ఇలా నిర్మలంగా ఉండదని ఆయన ప్రశ్నించారు. ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ, రెండు నగరాల మధ్య నెలకొన్న భిన్నమైన వాతావరణ పరిస్థితులపై చర్చకు దారితీసింది. భారత్‌లో కాలుష్యానికి అధిక జనాభానే ప్రధాన కారణమని చాలామంది భావిస్తుంటారని, కానీ వాస్తవానికి ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ టోక్యోలో గాలి, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని తన వీడియోలో వివరించారు. "భారతీయ ఆకాశాలతో ఉన్న సమస్య" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్‌ను పంచుకున్నారు. తన విదేశీ స్నేహితుల్లో కొందరు భారతదేశం అనగానే జనసమ్మర్దంతో కూడిన, దుమ్ముధూళితో నిండిన ప్రాంతంగా భావిస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికి హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఈశాన్య రాష్ట్రాల వంటి అందమైన, అత్యంత పరిశుభ్రమైన ప్రాంతాల గురించి తాను వివరిస్తుంటానని ఆయన పేర్కొన్నారు. మన దేశ రాజధానిలో కూడా స్వచ్ఛమైన ఆకాశం, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటే పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని ఓమ్ అభిప్రాయపడ్డారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే ఇది కచ్చితంగా సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- **అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ**
- **సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం**
- **నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**




తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## ఇది నాకో, సునీతమ్మకో జరిగిన
# అవమానం కాదు: సబితా ఇంద్రారెడ్డి

- **మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత**
- **కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన**
- **హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు**




అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు.. పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

- **అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం**
- **నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ**
- **మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు**
- **బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన**

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.



అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను
# వదిలిపెట్టం: హరీశ్ రావు

తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

- **అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్**
- **తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ**
- **తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్**
- **వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి**
- **స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన**



తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

# ఉద్యోగాల పేరుతో మోసం: ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.




## మారుతీ సుజుకీ షాక్..
# మళ్లీ ధరల పెంపు



ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన వినియోగదారులకు మళ్లీ ధరల షాక్ ఇచ్చింది. ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.20 వేల వరకు ధరలను పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ముడిసరుకుల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కాగా.. ఈ ఏడాది మే నెల నుంచి మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ''గత కొన్ని నెలలుగా వ్యయాన్ని నియంత్రించి ధరలను అందుబాటులోనే ఉంచేందుకు ప్రయత్నించాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల ఆర్థిక పరిస్థితుల వల్ల అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తోంది. ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.20 వేల వరకు పెంచాం'' అని కంపెనీ వెల్లడించింది. వినియోగదారులపై ఈ భారం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకుంటామని తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్‌ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది.

## విలన్లకు నో ఐఫోన్..
# యాడ్‌లో ఎప్పుడూ 9.41: యాపిల్ విశేషాలు తెలుసా..?

యాపిల్ క్రేజే వేరు. ఇక ఐఫోన్ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొత్త వెర్షన్ మార్కెట్‌లోకి వస్తోందంటే ఉండే హడావుడి అంతా ఇంతా కాదు. లాంచ్ రోజున క్యూ లైన్లలో నిలబడి మరీ వాటిని కొనేస్తారు. ఈ వారం ఐఫోన్ 18 సిరీస్ రాబోతుంది. ఈ వెర్షన్‌పై ఇప్పటికే టెక్‌ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. మరి ఇంత క్రేజ్ ఉన్న యాపిల్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు చూద్దామా..!

**మొదటి లోగో ఏంటంటే..**

యాపిల్ అనగానే మనకు గుర్తొచ్చేది సగం కొరికిన యాపిల్ పండే. కానీ, ఈ సంస్థ మొదటి లోగో ఇది కాదు. యాపిల్ చెట్టు కింద కూర్చున్న ఐజాక్ న్యూటన్ బొమ్మను లోగోగా రానాల్డ్ వేన్ డిజైన్ చేశారు. ఆ తర్వాత దాన్ని మార్చారు. ప్రస్తుతం ఉన్న లోగోను రాబ్ జానోఫ్ రూపొందించారు. దూరం నుంచి చూసినా, పరిమాణం తగ్గించినా చెర్రీ పండులా కనిపించకుండా..స్పష్టంగా యాపిల్ అని గుర్తు పట్టడానికి వీలుగా ఒక వైపు కొరికినట్లు పెట్టారు.

**'ఐ' అంటే అర్థం..**

ఐఫోన్‌లో 'i' అనేది కేవలం ఒక అక్షరం మాత్రమే కాదు..ఐదు వేర్వేరు అంశాలకు ప్రతీక. Internet, Individual, Instruct, Inform, Inspire అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ 1998లో వివరించారు.

**మూడో వ్యక్తి ఉన్నారు..**

స్టీవ్ జాబ్స్, స్టీవ్ వోజ్నియాక్‌లతో పాటు రానాల్డ్ వేన్ కలిసి యాపిల్ సంస్థను స్థాపించారు. అయితే, కంపెనీ ప్రారంభించిన 12 రోజులకే ఆయన



తన 10 శాతం వాటాను 800 డాలర్లకు అమ్మేసి బయటకు వెళ్లిపోయారు.

**ఎక్స్ ఖాతాకో ప్రత్యేకం..**

తన ఉత్పత్తులు, ఈవెంట్లను ఈ కంపెనీ తన ఎక్స్ ఖాతాలో ప్రచారం చేస్తుంది. కానీ ఆ పోస్టులు యాపిల్ ప్రొఫైల్‌లో కనిపించవు. వాటిని డార్క్ ట్వీట్ల రూపంలో పోస్ట్ చేస్తుంది. టైమ్‌లైన్‌లో ప్రకటనలుగా మాత్రమే కనిపిస్తాయే తప్ప యాపిల్ ప్రొఫైల్‌లో ఉండవు. కస్టమర్ సేవల కోసం @AppleSupport ఖాతాను నడుపుతోంది.

**యాడ్‌లలో 9:41 ఎందుకంటే?**

కంపెనీ విడుదల చేసే ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్‌లలో సమయం ఎప్పుడూ ఉదయం 9:41 గంటలనే సూచిస్తుంటుంది. 2007లో జరిగిన మొదటి ఐఫోన్ లాంచ్ ఈవెంట్ ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. దానికి సంబంధించిన విషయాలను చర్చించడానికి 42 నిమిషాలు పడుతుందని భావించారు. ఐఫోన్‌ను రివీల్ చేసే సమయానికి వినియోగదారుల గడియారాల్లో ఉన్న సమయమే ఫోన్‌లోనూ చూపించాలని ప్లాన్ చేశారు. అందుకే మొదట ఫోన్ స్క్రీన్‌పై సమయం ఉదయం 9:42 గంటలుగా సెట్ చేశారు. అయితే, దీనికి ఒక నిమిషం ముందే ఐఫోన్‌ను ఆవిష్కరించడంతో స్క్రీన్‌పై ఆ సమయాన్ని 9:41కి మార్చారు. అప్పటి నుంచి ప్రతి మోడల్‌కు సంబంధించిన యాడ్‌లో ఇదే టైం కన్పిస్తోంది. కాగా.. యాపిల్ వాచ్‌కు మాత్రం దీని నుంచి మినహాయింపు ఉంది.

**Siriని కొనేసి..**

Siriని ఆన్ చేసినప్పుడు కింద కనిపించేవి రంగుల బబుల్ గ్రాఫిక్స్ మాత్రమే కాదు.. మీరు మాట్లాడేటప్పుడు మీ వాయిస్ ఫ్రీక్వెన్సీ, పిచ్ ఆధారంగా ఆ రంగుల తరంగాలు కదులుతాయి. ఇక, Siri అనే వాయిస్ అసిస్టెంట్‌ను యాపిల్ సొంతంగా తయారుచేసింది కాదు. 2010లో ఒక స్వతంత్ర యాప్‌గా ఉన్న సిరిని ఈ సంస్థ కొనుగోలు చేసింది. ఐఫోన్ 4S నుంచి తమ ఫోన్లలో అంతర్భాగంగా మార్చింది.

**విలన్లకు ఐఫోన్లు ఉండవు**

హాలీవుడ్ లేదా ఇతర సినిమాల్లో నటించే విలన్లు సినిమాల్లో ఐఫోన్ ఉపయోగించకుండా యాపిల్ కఠినమైన నిబంధనలు విధించింది. సినిమాల్లో పాజిటివ్ పాత్రలకే స్క్రీన్‌పై ఐఫోన్ వాడటానికి అనుమతి ఉంటుంది.

**14 ఏళ్లు ఆ యాప్ లేకుండా...**

ఐప్యాడ్ విడుదలైనప్పటి నుంచి దాదాపు 14 ఏళ్ల వరకు అందులో క్యాలిక్యులేటర్ యాప్ లేదట. యాప్ డిజైన్ పర్ఫెక్ట్‌గా లేదని స్టీవ్ జాబ్స్ ఓసారి దాన్ని తిరస్కరించారు కూడా. ఇటీవలే ఐప్యాడ్ ఓఎస్18లో దీన్ని తీసుకొచ్చారు.

# తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌లో.. ఈ ఫీచర్లు ఉండవా?



అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ సెప్టెంబర్ 9న కొత్త ఐఫోన్ సిరీస్‌ను ప్రారంభించనుంది (Apple Foldable iPhone). అయితే, ఆ రోజు ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్‌లతో పాటు తొలి ఫోల్డబుల్ ఫోన్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఫోల్డబుల్ ఫోన్‌కు సంబంధించిన కొన్ని డమ్మీ యూనిట్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఐఫోన్ 18 ప్రో మోడళ్లతో పోలిస్తే, ఈ ఫోల్డబుల్ ఫోన్ డిజైన్‌లో కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

* **ఫోల్డబుల్ ఐఫోన్‌లో మార్పులు ఇవేనా..**

ఫేస్ ఐడీ సపోర్ట్ ఉండకపోవచ్చు. ప్రో మోడళ్లతో పోలిస్తే ఫోన్ మందం తక్కువగా ఉండటం వల్ల, ఫేస్ ఐడీకి బదులుగా సైడ్ పవర్ బటన్‌లోనే ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌తో కూడిన టచ్ ఐడీని ఇచ్చినట్లు తెలుస్తోంది. కెమెరా విభాగంలోనూ కొన్ని మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో టెలిఫోటో కెమెరా ఉండదని, ఫోన్ వెనుక వైపు కేవలం 48 ఎంపీ వైడ్, 48 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరాలను మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. డిస్‌ప్లే పరిమాణంలోనూ మార్పులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది 5.5 అంగుళాల అవుటర్ డిస్‌ప్లే, 7.8 అంగుళాల ఇన్నర్ డిస్‌ప్లేతో రావొచ్చు. స్క్రీన్ మడత స్పష్టంగా కనిపించకుండా ఉండేందుకు లిక్విడ్ మెటల్ హింజ్ సాంకేతికతను ఉపయోగించినట్లు తెలుస్తోంది. వాల్యూమ్ బటన్లను ఫోన్ పైభాగంలో కుడివైపు అమర్చే అవకాశం ఉంది. అంతేకాకుండా, ఇందులో ఫిజికల్ సిమ్ కార్డ్ స్లాట్ ఉండదని, ఇది కేవలం eSIMకు మాత్రమే సపోర్ట్ చేస్తుందని సమాచారం.

# భారత్ - జపాన్ మధ్య ప్రతిష్ఠాత్మక మ్యాచ్.. యూట్యూబ్‌లో లైవ్?




ఆసియా క్రీడల ముంగిట జపాన్‌తో టీమ్‌ఇండియా ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. శానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 22న మ్యాచ్ జరగనుంది. భారత్ జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవ సంబరాల ప్రారంభ సూచికగా దీన్ని నిర్వహిస్తున్నారు. అయితే, ఈ మ్యాచ్‌కు జపాన్‌లో ఓ సమస్య ఎదురు కాగా.. ఎలా పరిష్కరిస్తానేది ఆసక్తికరంగా మారింది.

**లాజిస్టిక్స్‌కు ఇబ్బంది..**

భారత్ జపాన్ ఏకైక టీ20 మ్యాచ్ ప్రసార హక్కులను తీసుకోవాలని ఇప్పటికే ఐటీడబ్ల్యూ యూనివర్స్‌తో జపాన్ క్రికెట్ అసోసియేషన్ చర్చించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలు ప్రారంభానికి రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ జరగనుంది. దీంతో నిర్వహణపరమైన సవాళ్లు ఎదురవుతాయని బ్రాడ్‌కాస్టర్లు ఆలోచనలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికీ టీవీ బ్రాడ్‌కాస్టింగ్ కూడా ఫైనలైజ్ కాలేదు. దీంతో యూట్యూబ్‌లో లైవ్ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కేవలం జపాన్‌లోనేనని.. భారత్‌లో ఫ్యాన్‌కోడ్‌తో కలిసి బ్రాడ్‌కాస్ట్ చేసే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఐటీడబ్ల్యూ సంస్థ స్టార్, సోనీ, జీ వంటి సంస్థలతోనూ చర్చలు జరుపుతోంది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో మహిళా క్రికెట్ ఫైనల్ కూడా అదే రోజు. ఇందులో భారతే 'గోల్డ్ మెడల్' ఫేవరెట్. ఆ మ్యాచ్ ముగిసిన రెండు గంటల్లోనే భారత్ జపాన్ పోరు జరగనుంది. దీంతో ఒకేరోజు రెండు మ్యాచులు ప్రసారం చేయడం జపాన్ బ్రాడ్‌కాస్టర్లకు సవాల్‌తో కూడుకున్నదే.

* **ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణ కోసం: సైకియా**

''సంప్రదాయ పరిధులను దాటి క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తం చేసేందుకు ఇలాంటి మ్యాచులు దోహదపడతాయి. అందుకు భారత్ జపాన్ మ్యాచ్‌నే కీలక అడుగుగా భావిస్తున్నాం. 22వ తేదీన ఇరుజట్లూ తలపడతాయి. జపాన్‌కు అంతర్జాతీయ క్రికెట్ శోభను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. కొత్త అభిమానులు వస్తారు. ఈ ప్రాంతంలో క్రికెట్‌ను విస్తరించేందుకు అవకాశాలు ఏర్పడతాయి'' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

# జిత్తుల మారి మోసిన్ 'నక్క'.. మళ్లీ డ్రామా చేసేందుకేనా వచ్చేది?



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ (Mohsin Naqvi) ఆసియా కప్ విషయంలో మరోసారి తన కపట బుద్ధిని ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారా? ఈ సందేహానికి ప్రధాన కారణం.. 'చీఫ్ గెస్ట్'గా ట్రోఫీ ప్రజెంటేషన్‌కు నఖ్వీ వస్తున్నట్లు వార్తలు రావడమే..! దీంతో గతేడాదిలా ఆయన మళ్లీ రసాభాస చేస్తాడనే విమర్శలు మొదలయ్యాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ గుర్తుందా.. ఫైనల్‌లో టీమ్‌ఇండియా గెలిచింది. కానీ, ఆసియా క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా కప్పును తీసుకొనేందుకు భారత్ విముఖత చూపింది. దానికి కారణం అతడు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గానూ ఉన్నారు. ఇక్కడే మోసిన్ నఖ్వీ 'జిత్తుల మారి'గా వ్యవహరించారు. ట్రోఫీని తానే ఇస్తానంటూ గదిలోకి తీసుకెళ్లి పెద్ద డ్రామా చేశారు. చివరకు ఆనాటి టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఖాళీగానే తన జట్టుతో కలిసి స్వదేశానికి వచ్చాడు. ఆ తర్వాత ట్రోఫీని ఏసీసీ కార్యాలయంలో ఉంచారు. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోసిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు.

**ఇప్పుడు.. అదే తంతు**

మళ్లీ సేమ్ డ్రామాను పునరావృతం చేసేందుకే అన్నట్లుగా మహిళల ఆసియా కప్ ఫైనల్‌కూ ఆయన చీఫ్ గెస్ట్‌గా వస్తారనే ప్రచారం సాగుతోంది. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం టోర్నీ లీగ్ స్టేజ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే భారత్ సెమీస్‌కు చేరుకుంది. పాకిస్థాన్ పోరాడుతోంది. టైటిల్ ఫేవరెట్‌గా భారత మహిళా జట్టే ఉంది. రెండు రోజుల కిందట పాకిస్థాన్‌ను టీమ్‌ఇండియా చిత్తు చేయడంతో.. పీసీబీ ఛైర్మన్ ఈ కొత్త ప్లాన్ వేసి ఉంటారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఫైనల్‌లో భారత జట్టు విజయం సాధిస్తే అప్పుడు నఖ్వీ ఎలా వ్యవహరిస్తారనేది చూడాలి. ఎందుకంటే టీమ్‌ఇండియా ఎలానూ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకోదు.

# టైటిల్ కొట్టాడు.. కేకేఆర్ కెప్టెన్సీ రేసులోకి దూసుకొచ్చాడు



కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కొత్త సారథ్యంపై చర్చ సాగుతోంది. అజింక్య రహానే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో.. వచ్చే సీజన్ నాటికి మరో ఆటగాడికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలోనే కెప్టెన్సీ రేసులో భారత యువ ఆటగాడు రింకు సింగ్ పేరు తెరపైకి వచ్చింది. రింకు ఇప్పటికే కేకేఆర్ జట్టులో ఆడుతున్నాడు. తాజాగా యూపీటీ20 లీగ్ టైటిల్‌ను తన జట్టుకు అందించాడు. అదీనూ సారథిగా కావడం గమనార్హం. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు రింకు సింగ్ ఎంపిక కాలేదు. దీంతో యూపీటీ20 లీగ్‌లో మేరఠ్ మావెరిక్స్ జట్టుకు సారథిగా వ్యవహరించాడు. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో లఖ్‌నవూ ఫాల్కన్స్‌పై మావెరిక్స్ జట్టు విజయం సాధించింది. లఖ్‌నవూకు వెటరన్ క్రికెటర్ భువనేశ్వర్ కుమార్ సారథిగా వ్యవహరించాడు. తుది పోరులో ఏకంగా 94 పరుగుల తేడాతో రింకు సింగ్ టీమ్ గెలిచింది. ఫైనల్‌లో బ్యాటర్‌గా అతడు విఫలమైనా.. కెప్టెన్‌గా మాత్రం జట్టుకు కప్పు అందించాడు.




## షఫాలీ వర్మ ఔట్ తర్వాత
# పాక్ కెప్టెన్ చేష్టలు.. ఐసీసీ చర్యలు



ఇటీవల భారత్‌తో మ్యాచ్‌లో షఫాలీ వర్మ వికెట్ తీశాక పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా సంబరాలు చేసుకున్న తీరు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె వ్యవహార శైలిని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని 'లెవల్ 1'ను ఉల్లంఘించినందుకుగానూ ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించింది. అదే విధంగా సనా ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ కూడా చేరింది. 24 నెలల వ్యవధిలో ఆమెకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఒక డీమెరిట్ పాయింట్ పడింది. అంపైర్ ఔట్ అని ప్రకటించినప్పటికీ క్రీజును వదిలి వెళ్లేందుకు నిరాకరించడంతో ఐసీసీ ఈమేరకు చర్యలు తీసుకుంది. మహిళల ఆసియా కప్‌లో భాగంగా ఇటీవల భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాక్ 55 పరుగులకే కుప్పకూలింది. భారత్ 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఈ లక్ష్యాన్ని ఛేదించింది. ఇన్నింగ్స్‌ను సిక్సర్‌తో ప్రారంభించి దూకుడు మీదున్న షఫాలీ వర్మ 12 పరుగులు చేసి.. ఫాతిమా సనాకు కాట్ అండ్ బౌల్డ్‌గా వికెట్ సమర్పించుకొంది. ఈ క్రమంలో పెవిలియన్ వైపు చేయి చూపిస్తూ ఫాతిమా సంబరాలు చేసుకొంది.

## దులీప్ ట్రోఫీ ఫైనల్..
# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ



కెప్టెన్సీతో తాను మరింత ప్రమాదకరంగా మారతానని భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ నిరూపించాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఇషాన్ (270) అద్భుతమైన డబుల్ సెంచరీ సాధించాడు. ఓవర్ నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్.. 163 ఓవర్లకు 708 పరుగుల వద్ద ఆలౌటయ్యింది. దీంతో రెండో రోజు ఆట ముగిసింది. కుమార్ కుశాగ్ర (101) సెంచరీ చేసి పెవిలియన్‌కు చేరాడు. కుశాగ్ర ఔటైన అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన అనుకుల్ రాయ్ (45)తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 24 ఓవర్లలోనే వీరిద్దరూ కలిసి ఆరో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించడం గమనార్హం. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురన విజయ్ నాలుగు వికెట్లు, మిలింద్, శ్రేయస్ గోపాల్ చెరో రెండు వికెట్లు, షేక్ రషీద్ ఒక వికెట్ తీశారు.




# టాక్సిక్‌కు దెబ్బ మీద దెబ్బ!

యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' భారీ నష్టాలను మూటగట్టుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ చిత్రానికి ఓటీటీ డీల్ విషయంలోనూ మేకర్స్‌కు మరో షాక్ తగిలినట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ హంగామా కథనం ప్రకారం.. 'టాక్సిక్' డిజిటల్ హక్కుల కోసం ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ తొలుత రూ.150 కోట్లు ఆఫర్ చేసిందట. మేకర్స్ రూ.200 కోట్లకుపైగా డిమాండ్ చేసినట్లు సమాచారం. థియేటర్లలో సినిమా భారీ విజయం సాధిస్తుందని, దీంతో ఓటీటీ ధర మరింత పెరుగుతుందని యశ్ భావించినట్లు కథనంలో పేర్కొంది. అయితే సినిమా ఫలితం అంచనాలకు భిన్నంగా ఉండటంతో ప్రస్తుతం అన్ని భాషల డిజిటల్ హక్కులకు రూ.30 కోట్ల వరకు మాత్రమే ఆఫర్లు వస్తున్నట్లు తెలుస్తోంది. వీటిలో అత్యధికంగా జీ5 నుంచి ఆఫర్ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఓటీటీ విడుదల కోసం సినిమాకు కొత్త ఎడిట్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తద్వారా డిజిటల్ రైట్స్‌కు మెరుగైన ధర దక్కుతుందని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కేజీఎఫ్ తర్వాత దాదాపు రెండేళ్లకు యశ్ నటించిన సినిమా కావడంతో 'టాక్సిక్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే విడుదలైన తొలిరోజు నుంచే సినిమాపై విమర్శలు రావడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందన దక్కలేదు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కియారా అద్వానీ, రుక్మిణీ వసంత్, తారా సుతారియా, నయనతార కీలక పాత్రల్లో నటించారు.

# శ్రీవిష్ణుకు జోడీగా ఆషికా



వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న ఆషికా రంగనాథ్‌కు మరో లక్కీ ఛాన్స్ దక్కింది. శ్రీవిష్ణు సరసన ఆమె కథానాయికగా నటించనున్నది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నంబర్ 39కు 'అనగనగా' ఫేమ్ సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ముహూర్తంతో సినిమా షూటింగ్ మొదలైంది. ఆషికా కూడా పాల్గొన్నది. నేటి యువత భావోద్వేగాలు, సమస్యల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గ్లింప్స్‌కు మంచి స్పందన వచ్చింది. నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీవిష్ణుకు ప్రేమికురాలిగా ఆషికా కనిపించనున్నది. ఇప్పటికే అమిగోస్, నా సామిరంగ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఆమె.. తాజాగా 'సర్దార్ 2'లోనూ సందడి చేసింది. వరుసగా క్రేజీ ప్రాజెక్టులు దక్కించుకుంటూ టాలీవుడ్‌లో తన జోరు కొనసాగిస్తోంది.



సినిమా

# రామాయణలో సాన్యా మల్హోత్రా?

నితేశ్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రామాయణ'లో బాలీవుడ్ నటి సాన్యా మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో ఆమె అహల్య పాత్రను పోషించనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటి వరకు చిత్రబృందం అఫీషియల్‌గా ప్రకటించలేదు. రామాయణంలో అహల్య పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. గౌతమ మహర్షి శాపంతో రాయిగా మారిన ఆమెకు శ్రీరాముడి పాదస్పర్శతో విముక్తి లభించే ఘట్టం కథలో కీలకంగా ఉంటుంది. దీంతో సాన్యా ఈ పాత్రలో ఎలా కనిపించనుందనే ఆసక్తి నెలకొంది. నితేశ్ తివారి-సాన్యా కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'దంగల్' భారీ విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత బదాయి హో, ఫొటోగ్రాఫ్, కథల్, జవాన్ వంటి చిత్రాలతో సాన్యా మంచి గుర్తింపు తెచ్చుకుంది. రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' పార్ట్-1 నవంబర్ 8న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.



# జాన్వీ.. ఆచితూచి

సౌత్ సినిమాల విషయంలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో కీలకపాత్రలో నటించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఇప్పటి వరకు చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. ఈ సినిమా మినహా దక్షిణాదిలో కొత్త ప్రాజెక్టులేవీ ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఇటీవల 'పెద్ది'లో తన పాత్రపై జాన్వీ కొంత అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఇకపై కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలకే ఓకే చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'దేవర', 'పెద్ది'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఆమె.. ప్రస్తుతం హిందీ చిత్రాలపై దృష్టిపెడుతూ, మంచి పాత్రల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. 'రాకా'లో ఆమె నటిస్తున్నదా లేదా అనే దానిపై మేకర్స్ స్పష్టత ఇస్తేనే జాన్వీ తదుపరి సౌత్ అడుగు ఏమిటన్నది తేలనుంది.



# రణబలి టీజర్‌కు ముహూర్తం ఫిక్స్!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తొలుత సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. అక్టోబర్ 16కు వాయిదా పడింది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ షురూ చేసింది. ఇందులో భాగంగా 'రణబలి' టీజర్‌ను సెప్టెంబర్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రత్యేకంగా రూపొందించిన వీడియో ద్వారా వెల్లడించింది. ఈ బుధవారం టీజర్‌తో సినిమా నేపథ్యం, కథా ప్రపంచంపై మరింత క్లారిటీ రానుంది. 19వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ చిత్రకథ బ్రిటీష్‌పాలన కాలం (1854–1878)లో జరిగిన చారిత్రక ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా. ఈ సినిమాను టీ-సిరీస్ సమర్పిస్తోంది. అజయ్-అతుల్ ద్వయం సంగీతం అందిస్తోంది